# వ్యర్థాలతో అద్భుతం

- లాసన్స్ బే పార్కుకు న్యూ లుక్
- పాడైన టైర్లతో వినూత్నంగా ముస్తాబు
- ఆహ్లాదకరంగా క్రీడా ప్రాంగణం

| నిధులు | నిధులు |
|---|---|
| రూ.16.5 లక్షలు 1900 కిలోల టైర్లతో క్రీడా ప్రాంగణాల్లో పరికరాలు | రూ.36 లక్షలు యోగా వేదిక, ప్రత్యేక మండపం, షెడ్ నిర్మాణం |



ఇది కదా అభివృద్ధి



వ్యర్థాలతో రూపొందించిన క్రీడా పరికరాలు



లాసన్స్ బే పార్కులో వేస్ట్ టైర్లతో అందుబాటులోకి తెచ్చిన క్రీడా ప్రాంగణం



క్రీడల్లో నిమగ్నమైన బాలురు



**నాడు:** పార్కులో రక్షణ గోడ నిర్మించక ముందు ఇలా..



**నేడు:** పార్కు వద్ద నిర్మించిన రక్షణ గోడ

వినూత్నంగా ఆలోచించాలే గానీ, వ్యర్థాలు కూడా అద్భుతంగా ముస్తాబై, ఆకట్టుకుంటాయి. చక్కని పరికరాలుగా మారి క్రీడా ప్రాంగణంలో చిన్నారులను స్వాగతిస్తాయి. ఇందుకు తార్కాణంగా నిలిచింది లాసన్స్ బే పార్కు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సూచనల మేరకు వేస్ట్ టు వండర్స్ కాన్సెప్ట్‌తో లాసన్స్ బే పార్కును కళాత్మకంగా తీర్చిదిద్దారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ద్వారా సేకరించిన వ్యర్థాలు, టైర్లతో అన్ని వయసుల వారికి ఆహ్లాదం పంచేలా క్రీడా ప్రాంగణాలు ముస్తాబు చేశారు. కేవలం రూ.16.5 లక్షలతో 1900 కేజీల పనికిరాని టైర్లకు సరికొత్త రంగులు, హంగులు అద్ది జారుడు బల్లలు, ట్రెక్కింగ్ వాల్స్, ఎడ్వెంచర్ ఏరియా, ఊయలలతో పాటు పలు రకాల క్రీడా పరికరాలను రూపొందించారు. పెద్దల కోసం రూ.36 లక్షలతో యోగా వేదికను, ప్రత్యేక మండపాన్ని, సేద తీరడానికి ప్రత్యేక షెడ్డును నిర్మించారు. అధునాతన గేటు నిర్మించారు. గతంలో శిథిలావస్థలో ఉన్న పార్కును చూసిన వారు .. ఇంతలో ఎంత మార్పు అంటూ ఆనందంగా సేద తీరుతున్నారు. చిన్నారులు ఆహ్లాదకర వాతావరణంలో ఆటపాటల్లో మునిగితేలుతున్నారు.

- ఎంవీపీకాలనీ

## మానవులు ఆత్మశక్తిని గుర్తించాలి



భగవద్గీత ప్రవచనం అందిస్తున్న సుశీలాజీ

**ఏయూక్యాంపస్:** మానవులు ఆత్మశక్తిని గుర్తించాలని స్వామి పార్థసారథి శిష్యురాలు సుశీలాజీ తెలిపారు. వేదాంత ఇనిస్టిట్యూట్ విశాఖపట్నం ఆధ్వర్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భగవద్గీత 9వ అధ్యాయంపై ఆమె ప్రవచించారు. మానవులు అజ్ఞానం వల్ల తమలో ఉన్న ఆత్మను గుర్తించడం లేదని, ఆత్మయే ఈ సృష్టికి మూలమని తెలుసుకోలేపోతున్నారని అన్నారు. ప్రాపంచిక సుఖాల కోసం, లేనిపోని ఆశలతో భావోద్వేగాలతో, ఆలోచనలతో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. జ్ఞానులు ఆత్మయే అన్నింటికీ మూలమని గ్రహించి, ఆత్మసాక్షాత్కారం కోసం జీవితాంతం భక్తి శ్రద్ధలతో పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో ముందుగా ఆధ్యాత్మిక గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో వేదాంత ఇనిస్టిట్యూట్ ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వేదిక వద్ద స్వామి పార్థసారథి రచించిన పుస్తకాలను ప్రదర్శనలో ఉంచారు.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



పడిపూజలో పాల్గొన్న మాలధారులు

**మద్దిలపాలెం:** శివాజీపాలెంలో శనివారం అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప భక్తి గీతాలలో మాలధారులు హోరెత్తించారు. స్వామియే శరణం అయ్యప్ప అంటూ స్వాములు భక్తిశ్రద్ధలతో స్మరించారు. అనంతరం భక్తులకు భిక్ష, కైంకర్యాన్ని అందించారు.

## క్లుప్తంగా

### లాలూతో కలిసి శ్రీవారిని దర్శించుకున్న వంశీకృష్ణ



తిరుమలలో లాలూ ప్రసాద్ యాదవ్‌తో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

**బీచ్‌రోడ్డు:** బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం తిరుమలలో వేంకటేశ్వరస్వామిని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా లాలూ కుటుంబ సభ్యులను ఆయన శాలువాతో ఘనంగా సన్మానించారు.

### నేటి నుంచి బాప్టిస్ట్ చర్చి వజ్రోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీవీ ప్రసాద్ తదితరులు

**బీచ్‌రోడ్డు :** అల్లిపురంలోని బాప్టిస్ట్ చర్చికి ఈ నెల 12వ తేదీతో 75 ఏళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా ఆదివారం నుంచి వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చర్చి చైర్మన్ పీవీ ప్రసాద్ తెలిపారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం బీచ్‌రోడ్డులోని వైఎంసీఏలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1948లో ఏర్పాటు చేసిన ఈ చర్చికి ప్రస్తుతం 5 వేల మంది సభ్యులున్నారన్నారు. వజ్రోత్సవ ప్రారంభోత్సవానికి ఎఫ్ఈబీఏ నేషనల్ డైరెక్టర్ సీఏ బెంజిమెన్, జాతీయ సెక్రటరీ ఎ. జెన్ని క్రిస్టఫర్ హాజరు కానున్నారన్నారు. మహిళలు, చిన్నారులకు అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమలో మ్యాచ్ పీటర్, కృపాదాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సహంగా వైజాగ్ మిరాకల్ క్రిస్మస్



మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

**బీచ్‌రోడ్డు:** బీచ్ రోడ్డులోని ఎంజీఎం పార్కులో బ్రదర్ కర్మోజీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైజాగ్ మిరాకల్ క్రిస్మస్ ఉత్సాహంగా సాగింది. వేల మంది క్రైస్తవులను ఉద్దేశించి బ్రదర్ కర్మోజీ, పాస్టర్ మ్యాథ్యూస్ శుభ సందేశాన్ని అందించారు. ముఖ్య అతిథి విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఏసుక్రీస్తు కృప ఎంతో అద్భుతమన్నారు. మరో అతిథి మేయర్ గొలగాని హరివెంకటకుమారి మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం చాటే విశాఖ ప్రజలంతా కుల మతాలకు అతీతమన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన లఘు నాటికలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో సిస్టర్ సుస్మిత, సుహాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఇద్దరు గంజాయి నిందితులకు రిమాండ్

**ఆరిలోవ:** గుట్టుగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను ఆరిలోవ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వారు తెలిపిన వివరాలిలా.. కర్ణాటక రాష్ట్రం గుగ్గికి చెందిన బసవర్ మురళీకృష్ణ, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన బండి రాహుల్ హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో బర్గర్ కేఫ్‌లో పనిచేసేవారు. ఇటీవల వారిరువురు పని మానేశారు. అక్కడ నుంచి నాలుగు రోజుల కిందట అరకు చేరుకున్నారు. అక్కడ ఓ వ్యక్తితో పరిచయం పెంచుకొని అతని వద్ద 5 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. దానిని తీసుకొని విశాఖ చేరుకున్న ఆ యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఆరిలోవ పోలీసులు కలిసి హనుమంతవాక వద్ద శనివారం పట్టుకున్నారు. వారి నుంచి 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచారు. వారికి కోర్టు రిమాండ్ విధించినట్లు ఆరిలోవ సీఐ సోమశేఖర్ తెలిపారు.

# సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు



12వ వార్డులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



19వ వార్డులో నృత్యరూపకంగా ఎంపీ ఎంవీవీని సత్కరిస్తున్న దృశ్యం

**ఆరిలోవ:** రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. 12వ వార్డులోని 21వ నంబర్ సచివాలయం సుందరయ్య నగర్‌లో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యంలో శనివారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన స్థానిక నాయకులతో కలిసి పార్టీ జెండా, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. వాటి ద్వారా అనేకమంది లబ్ధి పొందుతున్నారని చెప్పారు. 12వ వార్డులో అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నట్లు తెలిపారు. అందుకే రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ప్రజలు కోరుతున్నారన్నారు. కార్యక్రమంలో 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, జిల్లా వైల్డ్ లైఫ్ వార్డెన్ సత్తి మందారెడ్డి, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కె.మోహనరావు, స్థానిక నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, హుస్సేన్, సూర్యారావు, వరహాలు, సుజాత, సత్యనారాయణ, గ్లోరీ, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా జగనన్న పాలన

**ఎంవీపీకాలనీ:** ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగుతోందని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. 19వ వార్డు జాలరిపేటలో శనివారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ నాయకులతో కలిసి పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఎంవీవీ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో పేదలకు సంక్షేమాన్ని, అభివృద్ధిని చేరువ చేసిన ఘనత జగన్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. మత్స్యకారులకు ఏ ప్రభుత్వం కల్పించనంత భరోసా ఆయన కల్పించారన్నారు. అనేక రకాల పథకాలు అందించడంతోపాటు వేట విరామం సమయంలో రూ.10 వేలు ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జగన్ సర్కారును మళ్లీ గెలిపించుకోవడం ద్వారా రాష్ట్రంలో మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ దిశగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. అనంతరం నృత్యరూపక ప్రదర్శన ద్వారా ఎంపీ ఎంవీవీని సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, సూరాడ దాసు, పరసన్న, గణేష్, వసంత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఐఐఏఎం స్నాతకోత్సవం



విద్యార్థినికి డిగ్రీ పట్టా అందజేస్తున్న జస్టిస్ సోమయాజులు తదితరులు

**ఎంవీపీకాలనీ:** ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్(ఐఐఏఎం) స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఎంవీపీ కాలనీలోని ఆ కళాశాల వేదికగా ఈ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధిస్తోందన్నారు. టెక్నాలజీ, ఇండస్ట్రియల్ అభివృద్ధిలో దూసుకుపోతోందని చెప్పారు. చంద్రుడిపై శాటిలైట్‌ను లాంచ్ చేయడం ద్వారా అంతర్జాతీయంగా సత్తా చాటిందన్నారు. దేశ అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు నూతన విధానాలను అవలంభించడంతోపాటు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఆచార్య కేఎస్ఆర్ మూర్తి, ఆచార్య ఎంఆర్ రావు, డాక్టర్ సుంకరి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



16వ వార్డులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ, మేయర్ హరివెంకటకుమారి

**మద్దిలపాలెం:** జీవీఎంసీ 16వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శనివారం విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకటకుమారిలు కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావులతో కలిసి కేఆర్ఎం కాలనీలో శంకుస్థాపన చేసి శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. కేఆర్ఎం కాలనీలో పార్కుతోపాటు మౌలిక సదుపాయాల కల్పన పనులు జీవీఎంసీ నిధులు రూ.39.80 లక్షలతో చేపడుతున్నామని మేయర్ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. ఎంపీ మాట్లాడుతూ దేశంలో పరిశుభ్రమైన నగరంగా విశాఖకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నారన్నారు. జిల్లాలోనే అభివృద్ధిలో ఆదర్శంగా తూర్పు నియోజకవర్గాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ‘ఆడుదాం ఆంధ్రా’ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ తదితరులు

**ఎంవీపీకాలనీ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల పోస్టర్‌ను విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఆవిష్కరించారు. లాసన్స్ బే కాలనీలోని కార్యాలయంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడల్లో యువతను ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో ప్రోత్సహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 15న మెగా ఈవెంట్ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానుందన్నారు. ఫిబ్రవరి 3 వరకు వివిధ క్రీడల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి జూన్ గ్యాలియేట్, పలువురు జిల్లా క్రీడాధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## రైల్వే జోన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**రైల్వే మంత్రికి ఏపీ చాంబర్స్ వినతి**

**దొండపర్తి:** విశాఖలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. విశాఖ పర్యటనలో ఉన్న రైల్వే మంత్రిని శనివారం కలిసి పలు అంశాలపై వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో రైలు నెట్‌వర్క్ అభివృద్ధికి, రైలు కనెక్టివిటీని మెరుగుపరచడానికి ఈ కొత్త జోన్ కీలకమైందని పేర్కొన్నారు. రైలు ద్వారా తక్కువ దూరంలో కార్గో తరలింపును ప్రోత్సహించేందుకు 50 శాతం సబ్సిడీ కల్పించాలని కోరారు.

### యువగళం ముగింపునకు స్థల పరిశీలన

**మహారాణిపేట:** టీడీపీ నేత నారా లోకేష్ చేపట్టిన యువగళం ముగింపు కార్యక్రమానికి ఆ పార్టీ నేతలు పోలిపల్లి, ఇతర ప్రాంతాల్లో శనివారం స్థల పరిశీలన చేశారు. టీడీపీ నాయకుడు, జోన్ వన్ ఇన్‌చార్జి దామచర్ల సత్య ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, పార్టీ నాయకులు పల్లా శ్రీనివాసరావు, పాసర్ల ప్రసాద్, కోరాడ రాజబాబు, ఇతర నాయకులు పాదయాత్ర ముగింపునకు అనువైన ప్రాంతాన్ని పరిశీలించారు.



# కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి



హెచ్‌బీ కాలనీలో ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ స్టాల్

**మద్దిలపాలెం:** కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి సూచించారు. హెచ్‌బీ కాలనీలోని సీఎంఆర్ స్కూల్‌లో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ ద్వారా అమలు చేస్తున్న కేంద్ర పథకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వ తరఫున వచ్చిన ఐఏఎస్ అధికారి సాతి మహ్మద్ మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప యాత్ర రథాన్ని ఇక్కడ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం 9 ఏళ్లలో ఎన్నో పథకాలను అమలు చేసిందన్నారు. వాటి గురించి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం చాలా అవసరమన్నారు. బీజేపీ నాయకుడు సురేంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ లబ్ధిదారుల అభిప్రాయాల సేకరణకు కృషి చేస్తున్నామన్నారు.

## మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా



మృతుడి భార్యాపిల్లలకు బీమా తక్షణ సహాయం అందిస్తున్న ఎంపీ ఎంవీవీ

**ఆరిలోవ:** జీవీఎంసీ పదో వార్డులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వి.దుర్గారావుకు వైఎస్సార్ బీమా వర్తించింది. దీంతో విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ శనివారం సచివాలయం సిబ్బందితో కలసి ఇందిరానగర్-2లో నివాసముంటున్న మృతుడి ఇంటికి వెళ్లి, కుటుంబసభ్యులను పరామర్శించారు. బీమా తక్షణ సహాయంగా మంజూరైన రూ.10వేల నగదు మృతుడి భార్యా పిల్లలకు అందజేశారు. మిగిలిన మొత్తం కొద్ది రోజుల్లో బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగ్గుపిల్లి అప్పలరాజు, సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## మహిళలతో మమేకమై..



మహిళలతో మాట్లాడి స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి

**ఏయూక్యాంపస్:** జీవీఎంసీ 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి శనివారం ఉదయం 159 సచివాలయం పరిధి చిన వాల్తేరు రజక వీధిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యూజీడీ, విద్యుత్ దీపాలు, పారిశుధ్యం, వీధి కుళాయిలు, నీటి సరఫరా సక్రమంగా జరుగుతున్నాయా అని అడిగి, వారి వినతులను విన్నారు. అనంతరం మహిళలు తెలిపిన సమస్యలను అక్కడే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. నీటి సరఫరా ఏఈ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, విద్యుత్ విభాగం సిబ్బందిని పిలిచి తగిన సూచనలిచ్చారు. పర్యటనలో సచివాలయ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## శివాలయంలో దీపోత్సవం



దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

**మద్దిలపాలెం:** పీతలవానిపాలెం రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం దీపోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శివలింగ రూపంలో భక్తులు దీపాలను అలంకరించి వెలిగించారు. భక్తులు ఏకకాలంలో ఓం నమఃశివాయ అంటూ స్మరించడంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.